నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూచౌక్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన జనసందోహం

ఇందూరు.. జనసంద్రం

తండోపతండాలుగా తరలివచ్చిన జనం

నిజామాబాద్‌లో కేసీఆర్‌కు ఘనస్వాగతం • నెహ్రూచౌక్‌లో జననేత రోడ్‌షో సక్సెస్

అడుగడుగునా హోరెత్తిన నినాదాలు

నిజామాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ రాకతో ఉద్యమాల గడ్డ ఇందూరు పరవశించింది. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు నిజామాబాద్ జిల్లా బ్రహ్మరథం పట్టింది. అడుగడుగునా పూలవర్షంతో ఘనస్వాగతం పలికింది. హోరెత్తిన జన నినాదాలతో, గులాబీ గుబాళింపు మధ్య కేసీఆర్ బస్సుయాత్ర ఆద్యంతం సందడిగా సాగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. గులాబీ జెండాలు చేతబూనిన జనంతో దారులన్నీ కిక్కిరిసిపోవడంతో గులాబీ వనమా, జనసంద్రమా.. అన్న ఆశ్చర్యం కలిగింది. గులాబీ దళపతిని చూసేందుకు, కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు వచ్చిన వారితో రోడ్లన్నీ నిండిపోయాయి. నిజామాబాద్ నెహ్రూ చౌక్ వద్ద అశేష జనవాహినిని ఉద్దేశించి కేసీఆర్ చేసిన ప్రసంగం ఆద్యంతం కట్టి పడేసింది. తనదైన శైలిలో కేసీఆర్ సంధించిన వాగ్బాణాలకు చప్పట్ల వర్షం కురిసింది. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న ద్వంద్వ రాజకీయాలను కేసీఆర్ తన ప్రసంగంలో ఎండగట్టారు. కాంగ్రెస్ హామీల అమలులో జాప్యాన్ని, మోసాన్ని కండ్లకు కట్టినట్టుగా ప్రజలకు వివరించారు. ఐదు నెలల రేవంత్ రెడ్డి పాలనలో దగా పడుతున్న రైతులు, ఇతర వర్గాల ప్రజల సాధక బాధకాలను గులాబీ అధినేత విడమరిచి చెప్పారు. దాదాపుగా అరగంటపాటు సాగిన కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలంతా ఆసక్తిగా విన్నారు. సందర్భోచితంగా కేసీఆర్‌కు జై కొడుతూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్న కేసీఆర్ పిలుపునకు జనం చేతులెత్తి మద్దతు ప్రకటించారు.

కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగట్టిన కేసీఆర్

రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ మోసాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రసంగంలో ఎండగట్టారు.

బీజేపీ చెప్పినట్టు తాను వినలేదని తన బిడ్డ కవితను అరెస్ట్ చేసి జైల్లో వేశారని, తాను ఎన్నటికీ, ఎవ్వరికీ లొంగనని, పోరాటాన్ని ఉధృతం చేస్తానన్న కేసీఆర్ మాటకు జనమంతా చప్పట్లతో జేజేలు పలికారు. నేను హిందువును.. తెలంగాణ ప్రజలకు ఆత్మబంధువును.. అనగానే జే కేసీఆర్ అన్న నినాదాలు మిన్నంటాయి. కాంగ్రెస్ ఐదు నెలల పాలన వైఫల్యాలను ఎండగడుతూ, కేంద్రంలోని బీజేపీతో ఎదురైనా, ఎదురుకాబోతున్న నష్టాలను వివరించారు. కేసీఆర్ మాట్లాడుతున్నంత సేపు జనం ఉత్సాహం చూపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను కేసీఆర్ తనదైన శైలిలో ప్రశ్నించినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఒక్కో అంశాన్ని ప్రస్తావిస్తూ కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు జనమంతా ముక్తకంఠంతో రాలేదు.. అంటూ చేతులెత్తి తెలిపారు.

రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా, నెలకు రూ.2500 చొప్పున ప్రతి మహిళకు ఆర్థిక సాయం అందినదా?, రైతుబంధు అందరికీ వచ్చిందా, పంటకు రూ.500 బోనస్ వస్తున్నదా? కల్యాణలక్ష్మి తులం బంగారం వస్తుందా? అని కేసీఆర్ ప్రశ్నలకు రాలేదు రాలేదు.. అంటూ జనం ఏకకంఠంతో బదులిచ్చారు. ప్రధాని మోదీ ఇస్తానన్న రూ.15 లక్షలు మీ అకౌంట్లో జమ అయినయా? బేటీ పడావో.. బేటీ బచావో ఏమైనా జరిగిందా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ వచ్చిందా? అంటూ బీజేపీ పరిపాలన తీరును కేసీఆర్ వాగ్బాణాలు సంధించారు.

గులాబీ పరిమళం..

కేసీఆర్ ప్రభంజనం..

రాష్ట్రమంతా తిరుగుతున్న బీఆర్ఎస్ దళపతికి నీరాజనం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): 'ఎర్రటి ఎండల్లో గులాబీ పరిమళం.. తెలంగాణ అంతటా కేసీఆర్ ప్రభంజనం' అన్నట్టుగా సాగుతున్నది రాష్ట్రంలో కేసీఆర్ బస్సుయాత్ర. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గతనెల 24 చేపట్టిన బస్సుయాత్ర ప్రభావం రాష్ట్రమంతా కనిపిస్తున్నది. ఈ బస్సుయాత్ర ఇంకా నాలుగు రోజులే కొనసాగనున్నది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఇక తమకు ఎదురేలేదని కాంగ్రెస్ భ్రమపడింది. దేశమంతా తమ ఛత్రం తీసుకున్నాం.. ఇన్నాళ్లు బీఆర్ఎస్ గొడుగు కింద ఉన్న తెలంగాణను అతి సులువుగా తమ ఆధీనంలోకి తీసుకొవచ్చని బీజేపీ తలచింది. కానీ, రాష్ట్రంలో కేసీఆర్ రోడ్‌షోలకు హాజరవుతున్న ప్రభం'జనం'తో ఆ రెండు పార్టీలు బెంబేలెత్తిపోతున్నాయి. తెలంగాణ ప్రజల నుంచి కేసీఆర్‌ను వేరు చేయలేమని రెండు పార్టీలు అర్థం చేసుకున్నాయి. అందుకు కేసీఆర్ రోడ్‌షోలకు పోటెత్తుతున్న జనసునామీయే నిదర్శమని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతలు, ఆ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర నాయకులు చెప్పే మాటలకన్నా కేసీఆర్ చెప్పే విషయాలకే జనామోదం ఎక్కువగా ఉంటుందని ఇప్పుడే కాదు గతంలో అనేక పరిణామాలు స్పష్టం చేశాయని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మరోసారి అటువంటి వాతావరణాన్ని సృష్టించబోతున్నాయని తెలంగాణ మేధావులు తేల్చిచెప్తున్నారు.

కేసీఆర్ బస్సుయాత్రకు ముందూ తరువాత

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ముందు రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, సామాజిక వాతావరణానికి, ప్రస్తుత పరిస్థితికి మధ్య అసలు పోలికేలేదని సాక్షాత్తు కాంగ్రెస్ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. 'బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను మా వాళ్లు తక్కువగా అంచనావేశారు. వారికి ఉన్న రాజకీయ అనుభవం, పరిణతి కేసీఆర్‌ను మదింపు చేయలేవు' అని కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. గతనెల 24న మిర్యాలగూడ రోడ్‌షోలో కేసీఆర్ చేసిన ప్రసంగం నుంచి మొదలుకుంటే సోమవారంలో నిజామాబాద్ కేసీఆర్ రోడ్‌షో దాకా ఉత్తర, దక్షిణ తెలంగాణను కేసీఆర్ చుట్టివచ్చారు. ఈ 13 రోజుల్లో మధ్యలో 48 గంటలు మినహా (స్థూలంగా జమ్మికుంట రోడ్‌షో మినహా) కేసీఆర్ చేసిన ప్రసంగాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఏకీభవిస్తున్నారని క్షేత్రస్థాయిలో నెలకొన్న వాతావరణం చెప్తున్నది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ పార్టీల అగ్రనేతలు కేసీఆర్ ప్రభావాన్ని తగ్గించాలని కాంగ్రెస్ అగ్రనేత నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గే.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, జేపీ నడ్డాసహా అనేక మందిని తెలంగాణకు రప్పించి ప్రయోజనం పొందాలని చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించేలా కనిపించటంలేదని క్షేత్రస్థాయి వాతావరణం చెప్తున్నది. బస్సుయాత్ర పొడవునా కేసీఆర్‌కు యువత నీరాజనం పలుకున్నది. చిన్నచిన్న గ్రామాల మొదలు మండల కేంద్రాల్లో, పట్టణ కేంద్రాల్లో కేసీఆర్‌ను జనం కండ్లకు అద్దుకుంటున్నారు. ఆడబిడ్డలు బస్సు ముందు మంగళహారతులు పడుతున్నారు. గ్రామపెద్దలు గుమ్మడికాయలతో కేసీఆర్‌కు దిష్టితీసే దృశ్యాలు ఊరూరా దర్శనమిస్తున్నాయి. కేసీఆర్ రోడ్‌షో నిర్దేశిత ప్రాంతానికి చేరుకునే రెండు గంటల ముందు నుంచే యువత హంగామా చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు అంతగా ఆసక్తిచూపని యువతలో మార్పు వచ్చిందని పార్లమెంట్ ఎన్నికల్లో ఆ మేరకు ప్రభావం చూపుతుందని పేరు చెప్పటానికి నిరాకరించిన ఒక సామజికవేత్త విశ్లేషించారు.



డాక్టర్ రమణయ్యకు పాదాభివందనం చేస్తున్న కేసీఆర్

గురువును కలిసిన కేసీఆర్

- డాక్టర్ రమణయ్య ఇంటికి కేసీఆర్
- పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత
- రమణయ్య సార్ భావోద్వేగం
- యూఆర్ ఫాదర్ ఆఫ్ తెలంగాణ అంటూ గులాబీ బాస్‌కు ప్రశంసలు

జగిత్యాల, మే 6, (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం తన గురువు జైశెట్టి రమణయ్య సార్‌ను కలిశారు. జగిత్యాలలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కేసీఆర్ స్వయంగా తన ఇంటికి రావడంతో రమణయ్య భావోద్వేగానికి గురయ్యారు. ఆదివారం జగిత్యాలలో రోడ్‌షో నిర్వహించిన కేసీఆర్ ఈ సందర్భంగా తన గురువు, కవి అయిన రమణయ్య సార్‌ను గుర్తుచేసుకున్నారు. రోడ్‌షో అనంతరం రాత్రి జగిత్యాలలోని ఎమ్మెల్సీ ఎల్ రమణ నివాసంలో బసచేసిన కేసీఆర్ సోమవారం సాయంత్రం నిజామాబాద్‌లో రోడ్‌షోకు వెళ్లడానికి ముందు రమణయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం అనారోగ్యంతో మంచం నుంచి కదలలేని స్థితిలో ఉన్న రమణయ్యకు పాదాభివందనం చేశారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా ఉన్నప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు.

చరిత్ర బోధనలో అఖండుడు మా గురువు

గురుశిష్యులు ఇరువురు కలుసుకున్న సమయంలో కేసీఆర్ తమ గురువైన రమణయ్య సార్ చరిత్ర బోధనలో ఎంతటి అఖండుడో గుర్తుచేసుకున్నారు. 1970 నుంచి 1974 వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డాక్టర్ రమణయ్య చరిత్ర ఉపన్యాసకుడిగా పీయూసీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ తరగతులకు బోధించిన అంశాలను జ్ఞాపకం చేసుకున్నారు. సంక్లిష్టమైన పాఠ్యాంశాన్ని అయినా రమణయ్య సార్ అనర్గళంగా, సులభంగా బోధించేవారని చెప్పారు. చరిత్ర బోధనతో పాటు చరి త్ర పరిశోధన, సౌత్ ఇండియన్ టెంపుల్స్‌పై ఆయన రాసిన పుస్తకాలు, కరీంనగర్ సమ గ్ర చరిత్ర పుస్తక రచనను కేసీఆర్ ప్రస్తావించారు.

ఫాదర్ ఆఫ్ తెలంగాణ.. క్రియేటర్ ఆఫ్ తెలంగాణ

డాక్టర్ రమణయ్య సార్ కూడా కేసీఆర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. 1972లో సిద్దిపేటకు వచ్చిన కేంద్ర మంత్రికి డిగ్రీ కాలేజీలో విద్యార్థిగా ఉన్న కేసీఆర్ నేతృత్వంలో సిద్దిపేటను జిల్లా చేయాలని కోరుతూ వినతిపత్రం అందించిన విషయాన్ని గుర్తుచేసి, కేసీఆర్‌ను అభినందించారు. 2015లో తెలంగాణ తొలి ఆవిర్భావ వేడుకల సమయంలో తాను ఉత్తమ పరిశోధకుడిగా రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన సమయంలో చెప్పానని, ఇప్పుడు మళ్లీ చెబుతున్నానని.. 'కేసీఆర్ యూ ఆర్ ఏ ఫాదర్ ఆఫ్ తెలంగాణ, క్రియేటర్ ఆఫ్ తెలంగాణ, మేకర్ ఆఫ్ బంగారు తెలంగాణ' అని కొనియాడారు. కేసీఆర్ వినమ్రపూర్వక నమస్కారం చేశారు. ఎందరో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి విఫలమయ్యారని, తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించి, విజయం సాధించి, రాష్ట్రాన్ని సాకారం చేయడం కేసీఆర్‌కే చెల్లిందని, అలాంటి కేసీఆర్ తనకు శిష్యుడు కావడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను రమణయ్య సార్ శాలువతో సత్కరించడంతో పాటు తాను సంకలనం చేసిన పుస్తకాలను అందజేశారు. రమణయ్య సార్ ఆరోగ్య పరిస్థితులను, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రమణయ్యను పరామర్శించిన సమయంలో కేసీఆర్ వెంట జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులున్నారు.

కేంద్రంలో ప్రాంతీయ శక్తులకే అధికారం

ఎన్డీయే, ఇండియా కూటములకు పరాభవం తప్పదు

- కాంగ్రెస్, బీజేపీ పాలనలో దేశం ఎంతో నష్టపోయింది
- రాష్ట్రంలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రజలకు కాంగ్రెస్ నిజ స్వరూపం తెలిసిపోయింది
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డజనుకుపైగా సీట్లు ఖాయం
- బీజేపీకి 200 దాటుతాయని చెప్పడం గోబెల్స్ ప్రచారం
- పీటీఐతో బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమే అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. ఎన్డీయే, ఇండియా కూటములకు పరాభవం తప్పదని అన్నారు. జాతీయ వార్తా సంస్థ పీటీఐ సోమవారం కేసీఆర్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెప్పారు. అబద్ధపు హామీలను నమ్మి మోసపోయామని ప్రజలకు అర్థమైందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ డజనుకుపైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సముద్రమంత పార్టీ అని, నలుగురైదురు నేతలు వెళ్లిపోయినంత మాత్రాన నష్టం లేదని అన్నారు. వీటితోపాటు ఇంటర్వ్యూలో పంచుకున్న పలు అంశాలు యథాతథంగా..

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నది? ఈ ఎన్నికలపై వంద రోజుల పాలన ప్రభావం కనిపిస్తుందా?

రాష్ట్రాన్ని పాలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇది నా మాట కాదు. స్వయంగా ప్రజలు చెపున్న మాట. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. ఇది ప్రారంభం మాత్రమే. ఇంకా అధ్వానమైన పాలన చూడబోతున్నాం.

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తక్కువ స్థానాలు వస్తాయని కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తున్నది కదా?

ఇది వారి భ్రమ మాత్రమే. వాళ్లు అంధకారంలో మునిగిపోయి ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో పోల్చితే తెలంగాణ ప్రజలు ఎక్కువగా అభిమానించే పార్టీ బీఆర్ఎస్. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాకపోవచ్చు. పొరపాటున ఒక్కసీటు వస్తే రావొచ్చు. బీఆర్ఎస్ కచ్చితంగా డజనుకుపైగా స్థానాల్లో గెలుస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్.. మళ్లీ ఒక్కసారిగా పుంజుకొని, డజనుకుపైగా సీట్లలో గెలుస్తుందని ఎలా అనుకుంటున్నారు?

ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ గెలవాలో, ఏ పార్టీ ఓడిపోవాలో ప్రజలు నిర్ణయిస్తారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది. ఇందులో ఆరింటిని గ్యారంటీలుగా చెప్పింది. వాటిని అమలు చేయడానికి ప్రత్యేకంగా చట్టం చేస్తామని హామీ ఇచ్చింది. ప్రజలు అసత్యపు హామీలను నమ్మారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పంటలు ఎండిపోతున్నాయి, తాగునీరు అందడం లేదు, భారీగా విద్యుత్తు లోటు కనిపిస్తున్నది. విద్యుత్తు సరఫరా సరిగా లేక రైతుల మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. గత తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ చూడని పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ప్రజలకు ఈ విషయం అర్థమైంది. అబద్ధపు హామీలకు మోసపోయామని తెలుసుకున్నారు.. కాబట్టి ఈ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు.

పలువురు నేతలు బీఆర్ఎస్‌ను వీడుతున్నారు కదా? ఏమైనా ప్రభావం ఉంటుందా?

ప్రస్తుత రాజకీయాల్లో 'పొద్దుతిరుగుడు పువ్వు' నేతలు ఎక్కువయ్యారు. సూర్యుడి చుట్టూ పొద్దు తిరుగుడు పువ్వు తిరిగినట్టు.. కొందరు నేతలు అధికారం చుట్టూ తిరుగుతున్నారు. బీఆర్ఎస్ నుంచి వేళ్లమీద లెక్కపెట్టగలిగేంత మంది మాత్రమే వెళ్లిపోయారు. బీఆర్ఎస్ పార్టీ సముద్రం లాంటిది. మాకు 60 లక్షల మంది సభ్యత్వం ఉన్నది. భారీ సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు. వీటితో పోల్చితే మా పార్టీ నుంచి వెళ్లిపోయింది అతి తక్కువ మంది. ఈ ఎన్నికల్లో వాళ్ల ప్రభావం ఏమీ ఉండదు. పార్టీ చాలా బలంగా ఉంది. ఆందోళన అవసరం లేదు.

మీరు గతంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు రావాలని కోరుకుంటున్నారు?

నేను బీజేపీ, కాంగ్రెస్ కాకుండా ఒక ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేయాలని భావించాను. ఎందుకంటే కాంగ్రెస్, బీజేపీ పాలనతో దేశం ఎంతో నష్టపోయింది. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలన ఒక వైఫల్యం అయితే.. మోదీ పాలన ఏకంగా ఒక విపత్తులా పరిణమించింది. బీజేపీ పాలనలో ఏ ఒక్క వర్గానికి కూడా ప్రయోజనం కలుగలేదు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు రూపాయి విలువ పడిపోతుందంటూ మోదీ కేంద్రంపై విరుచుకుపడ్డారు. మరి ఇప్పుడు డాలర్‌కు రూ.84 స్థాయికి ఎందుకు పతనం అయ్యిందో సమాధానం ఇవ్వగలరా?. దేశం నుంచి పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతున్నారు, దిగుమతులు పెరిగిపోయాయి. రైతులకు మోదీ క్షమాపణ చెప్పాలి. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని స్వయంగా కొందరు మంత్రులు చెప్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటింది. అయినా ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎందుకు ఉండాలి? మనతో ప్రయాణం మొదలుపెట్టిన చైనా ఎలా మారిపోయిందో అందరికీ తెలుసు. రెండో ప్రపంచ యుద్ధంలో అణు బాంబు దాడికి గురైన జపాన్ ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నది? మనం ఎక్కడున్నామో ఆలోచించాలి. మన దేశంలో అద్భుతమైన సహజ వనరులు ఉన్నాయి. అపారమైన నీటి వనరులు ఉన్నాయి. కావాల్సినంత బొగ్గు ఉన్నది. అయినా దేశం ఇప్పటికీ కరంటు కోతలు ఎదుర్కొంటున్నది. డిమాండ్‌కు తగినంత సరఫరా లేక అంధకారంలో ఉంటున్నది. అందుకే పారిశ్రామికవేత్తలు దేశానికి వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇటీవలే టెస్లా వచ్చి పారిపోయింది. ఇవన్నీ ప్రజల అనుభవంలో ఉన్నాయి. ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ ఎలాంటివో స్పష్టంగా అర్థమైంది. వాళ్ల వల్ల దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదని తెలిసిపోయింది.

మాకు 400 సీట్లు ఖాయమని బీజేపీ చెప్పున్నది. రెండు దశల ఎన్నికల్లోనే 200 సీట్లు వస్తాయని అమిత్‌షా చెప్పున్నారు కదా?.

ఈ ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా రావు. అలాంటిది రెండు దశల్లోనే 200 సీట్లు దాటామని చెప్పడం గోబెల్స్‌ను మించిన ప్రచారం. ప్రాంతీయ పార్టీలు బలమైన శక్తిగా మారబోతున్నాయి.

దేశంలో ఎన్డీయే, ఇండియా కూటముల మధ్య పోటీ కనిపిస్తున్నది. మీరు రెండింటిలోనూ లేరు. హంగ్ ఏర్పడితే ఎటువైపు ఉంటారు?

మీ ప్రశ్నే తప్పు. ఎన్డీయే కూటమి, ఇండియా కూటమి మధ్యే పోటీ అనే భావన సరికాదు. పైగా ఇప్పుడు ఇండియా కూటమి అనేదే లేదు. మమతా బెనర్జీతోపాటు చాలా మంది కూటమి నుంచి బయటికి వచ్చేశారు. ఇప్పుడు బీజేపీ లేదా ఎన్డీయేతో గట్టిగా పోరాడుతున్నది ప్రాంతీయ పార్టీలు మాత్రమే. ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీలే బలమైన శక్తిగా మారబోతున్నాయి. కాబట్టి ఇందులో తెలంగాణకు సంబంధించి బలమైన వాణి వినిపించేలా ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉన్నది. హంగ్ ఏర్పడితే మేము కాంగ్రెస్, బీజేపీల్లో ఎవరికీ సపోర్ట్ చేయం. ప్రాంతీయ పార్టీలు ఏర్పాటు చేయబోయే కూటమికే బీజేపీ, లేదా కాంగ్రెస్ వచ్చి సపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

కొత్త కూటమిలో ప్రధాని ఎవరవుతారు?

అనుభవం, ప్రజాదరణ ఉన్న మంచి నేతను ప్రధానిగా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై మీ స్పందన?

ఇదంతా మోదీ సృష్టి. లేని కుంభకోణంలో నా బిడ్డ కవితను అరెస్ట్ చేయడం పెద్ద జోక్. ఇప్పుడు దేశంలో నేను, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ వంటి నలుగురైదుగురు నేతలు మాత్రమే బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్నాం. ఇది ఆయన తట్టుకోలేకపోతున్నారు. అందుకే లిక్కర్ స్కామ్‌ను తెరమీదికి తెచ్చి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. అసలు ఇది కుంభకోణమే కాదు. ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానం. ప్రభుత్వం తెచ్చిన పాలసీని కుంభకోణం అని ఎవరైనా అంటారా? మోదీ సృష్టించిన కట్టుకథలు కాకపోతే.. ఒక్క రూపాయి కూడా ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారు?.

మీరు ప్రచారం నిర్వహించకుండా ఎన్నికల సంఘం 48 గంటల నిషేధం విధించడంపై మీ స్పందన?

బస్సుయాత్రతో ప్రజల్లో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్, బీజేపీ భయపడ్డాయని ఈ ఘటన రుజువు చేస్తున్నది. అందుకే నా గొంతు నొక్కాలని ప్రయత్నించారు. మోదీ మతవిద్వేష వ్యాఖ్యలు చేసినా ఈసీ పట్టించుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నాపై అభ్యంతరకరమైన భాష వాడినా ఏమీ అనడం లేదు. మేం ఇచ్చిన ఫిర్యాదులను పక్కన పెట్టేస్తున్నారు. అయినా ఈ నిషేధం ఎలాంటి ప్రభావం చూపదు. వాళ్ల గురించి ప్రజలకు అర్థమైంది. ఎన్నికల్లో దానిని చూపిస్తారు.

● అధినేతకు కొబ్బరి మాల..

నిజామాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం ఎండుకొబ్బరి కుడకలతో కూడిన దండతో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో సత్కరిస్తున్న ఆ రాష్ట్ర సీనియర్ నేతలు శంకరన్న దోండ్గే, సుధీర్ బిందు, గణేశ్ కదమ్ తదితరులు. చిత్రంలో ఎంపీ సురేశ్‌రెడ్డి కూడా ఉన్నారు.

● కేసీఆర్‌కు బిగాల గణేశ్ గుప్తా ఆతిథ్యం..

నిజామాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నిజామాబాద్ మేయర్ నీతూకిరణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కూడా ఉన్నారు.

● రాకేశ్‌రెడ్డికి బీఫాం అందజేస్తూ..

నిజామాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా నివాసంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి బీఫాం అందజేస్తున్న అధినేత కేసీఆర్. చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి, రాజారాం యాదవ్ తదితరులు